క్లుప్తంగా

సంపూర్ణ ఆరోగ్యమే ఆశయం

పోరుమామిళ్ల : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను సంపూర్ణ ఆరోగ్య రాష్ట్రంగా చేయాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ఈనెల 14 నుండి అక్టోబర్ నెలాఖరు వరకు జరుగుతుందన్నారు. జేఏఎస్ కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి వారికి ఈ పథకం గురించి వివరిస్తారన్నారు. వలంటీర్లు, గృహ సారథులు ఆ కుటుంబంలోని వారి ఆరోగ్య సమాచారం సేకరించి వైద్యసిబ్బందికి ఇస్తారన్నారు. వైద్యసిబ్బంది ఏడు రకాల పరీక్షలు నిర్వహించి చికిత్సకు అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు.

'అవాంఛనీయ సంఘటనలకు తావులేదు'

అట్లూరు : వినాయక చవితి సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ కేసీ.రాజు పేర్కొన్నారు. వినాయక చవితి పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాలలో 66 వినాయక విగ్రహాలను అనుమతుల ద్వారా నెలకొల్పారన్నారు. అయితే విగ్రహాలు నెలకొలిపిన గ్రామాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని సూచించామన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు బాధ్యతగా ఉండి నిమజ్జనాన్ని ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి పోటీలకు 13 మంది విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో వల్లూరు నాగేంద్రారెడ్డి, నరేంద్రారెడ్డి, ఉపాధ్యాయులు

ప్రొద్దుటూరు : మండలంలోని కల్లూరు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 13 మంది విద్యార్థులు ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో ముగ్గురు, కబడ్డీ అండర్-14 విభాగంలో ఐదుగురు , వాలీబాల్ అండర్-14 విభాగంలో ముగ్గురు, అండర్-17 విభాగంలో ఇద్దరు ఎంపికయ్యారని పాఠశాల పీడీ అల్లాబక్ష్ వివరించారు. మంగళవారం పాఠశాల ప్రార్థన సమయంలో కల్లూరు గ్రామ మాజీ సర్పంచ్ వల్లూరు నాగేంద్రారెడ్డి, వైస్ సర్పంచ్ నరేంద్రరెడ్డి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వారికి అవసరమైన రూ.10వేలు విలువైన ఆట వస్తువులను, తెలుగులో వ్యాసరచన పోటీల బహుమతులకు రూ.1500 అందించారు. స్పోర్ట్స్ డ్రెస్సులను అందిస్తానని వైస్ సర్పంచ్ నరేంద్ర రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు విజయ మోహన్‌రెడ్డి, ఖాజాపీర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి

కాశినాయన : వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 50 విగ్రహాలు ఏర్పాటు చేశారని, వినాయక నిమజ్జన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగితే కమిటీ సభ్యులదే బాధ్యత అన్నారు. నిమజ్జనం రోజు సాయంత్రం 6 గంటల లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు.

నేడు వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని విశ్వనాథపురం, రాజకొట్టాల గ్రామాలలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక 41వ వార్డు వెంకటేశ్వర్లపేటలో విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ వినాయక విగ్రహం వద్ద వికసిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ శూలం లక్ష్మీదేవి, శూలం ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రంలో శూలం శివ, వెంకటయ్య, కొండయ్య, కమిటీ సభ్యులు డీవీ రామాంజనేయులు, వినోద్, నాగేంద్ర, బ్రహ్మేంద్ర, సతీష్, సునీల్, సుబ్రహ్మణ్యం, రాము, సాయి, మోహన్ పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ, ఎమ్మార్పీఎస్ నాయకుడు సుధాకర్ మాదిగ ఆధ్వర్యంలో డ్రైవర్ కొట్టాలులో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వార్డు కౌన్సిలర్ వై.జయంతి, వైఎస్సార్ జిల్లా జిల్లా అధికార ప్రతినిధి పగిడాల దస్తగిరి, సుబ్బరాయుడు యాదవ్ పాల్గొన్నారు.

రక్తదానం

ప్రొద్దుటూరు : ప్రభుత్వాస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న మధు అనే వ్యక్తికి ఓ పాజిటివ్ రక్తం అవసరమని అతని బంధువులు డొక్కా సీతమ్మ అన్నదాన, రక్తదాన సేవా సంస్థ పర్యవేక్షకుడు గంజి సురేష్‌కుమార్‌ను సంప్రదించారు. ఆయన టి.హర్షవర్ధన్‌చే రక్తదానం చేయించారు.

జై జై గణేశా..జై కొడతా గణేశా

బద్వేలు అర్బన్ : వినాయక చవితి పండుగను సోమవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బద్వేలు పట్టణంతో పాటు రూరల్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో కూడా పండుగను వైభవంగా జరుపుకున్నారు. ఈ ఏడాది పట్టణ, మండల వ్యాప్తంగా సుమారు 127 విగ్రహాలను ఏర్పాటు చేశారు. అలాగే ఇళ్లలో కూడా వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అలాగే దుకాణాలు, వ్యాపారసంస్థల్లో కూడా పూజలు జరిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేశ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్మన్ వాకమళ్లరాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వినాయకనగర్, గాంధీనగర్, సురేంద్రనగర్, సిద్దవటం రోడ్డు (ఎన్‌జీవో కాలనీ, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం), రాధాక్రిష్ణనగర్, శివానగర్, ఆంజనేయనగర్, గాండ్లవీధి, అమ్మవారిశాలవీధి, కోటవీధి, మిద్దెలవారిపాళెం, నెల్లూరు రోడ్డులోని సుమో డ్రైవర్స్ అండ్ ఓనర్స్ యూనియన్, అశోక్‌నగర్, రూపరాంపేట, రజకవీధి, అబ్బరాతివీధి, దర్గావీధి, రామాంజనేయనగర్‌లలో భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. ఆయా వీధులలోని మండపాల వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గణపయ్యా ... మనసాస్మరామి

కాశినాయన : పిల్లలు, పెద్దలు తేడాలేదు. కులాలు, మతాల ప్రస్తావనే లేదు. వినాయకచవితి పండుగను పురస్కరించుకుని ఊరూవాడా విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఏడాది ఎన్ని పండుగలు వచ్చినా వినాయక చవితి తెచ్చే సంబరం, సంతోషం మాటల్లో చెప్పలేనిది. పల్లె నుండి పట్నం దాకా, మురికివాడల నుండి అపార్ట్‌మెంట్స్ వరకు ఎవరి స్థాయిలో వారు వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో సోమవారం 50 వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. పిల్ల, పెద్దలు అందరూ పాల్గొని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. బుధవారం కొన్ని విగ్రహాలు, 22వ తేదీన కొన్ని విగ్రహాలను వినాయక నిమజ్జం చేయనున్నారు.

గణనాథుడికి ఘనంగా పూజలు

గోపవరం : వినాయకచవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటుచేసిన గణనాథులకు మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా వినాయకచవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కొన్ని గ్రామాల్లో మూడవ రోజున గణనాథులను నిమజ్జనానికి తరలించనున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఐదవ రోజు నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామస్తులతో పాటు యువతీ యువకులు పూజల్లో పాల్గొన్నారు.


బద్వేలు అర్బన్ : వినాయక విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్


పోరుమామిళ్ల : రెడ్డినగర్ బ్లెస్డ్‌బ్రెయాన్ ఆశ్రమం వద్ద గణనాయకుడికి పూజలు


కాశినాయన : రెడ్డికొట్టాలలో కొలువుదీరిన విఘ్నేశ్వరుడు


గోపవరం : రాచాయపేటలో పూజా కార్యక్రమాల్లో భక్తులు


కలసపాడు : వెంకటేశ్వరకాలనీలో పూజలందుకుంటున్న వినాయకుడు


బి.కోడూరు : మేకవారిపల్లెలో కొలువుదీరిన వినాయకుడు

కలసపాడులో..

కలసపాడు : వినాయకచవితి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా పందిళ్లలో కొలువుదీరిన గణనాథులకు సోమ, మంగళవారాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బుధవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అత్యధికంగా ఎగువ రామాపురంలో, కలసపాడులో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

బి.కోడూరులో..

బి.కోడూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాలకు రెండు రోజులుగా పూజలు నిర్వహించడంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా మండలంలో సుమారు 25 పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

వైభవంగా చవితి ఉత్సవాలు

పోరుమామిళ్ల : వినాయక చవితి పండుగను మండలంలో ప్రజలు సోమ, మంగళవారం అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి వినాయక విగ్రహాలను పోరుమామిళ్ల నుండి గ్రామాలకు తీసుకెళుతున్నారు. పట్టణంలో విగ్రహాలు అమ్ముతున్న వారికి వారం పది రోజుల ముందే అడ్వాన్సులు ఇచ్చి, విగ్రహాలు ఎంపిక చేసుకున్నారు. విగ్రహాలు ప్రతిష్టించిన వీధుల్లో పూజలు ప్రారంభించారు. మంగళవారం పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి గుడిలో తోట ఉత్సవం నిర్వహించారు. వినాయకున్ని పచ్చని చెట్లు, ఆకులు, వివిధరకాల పండ్లు, పూలతో చూడ చక్కగా అలంకరించారు. మండల వ్యాప్తంగా వినాయక విగ్రహాల వద్ద మూడు రోజుల పూజలు, ఆధ్యాత్మిక, సాంస్కతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించేదానికి ఏర్పాట్లు చేసుకున్నారు. బుధవారం నిమజ్జనం చేసేందుకు చాలామంది నిర్ణయించుకున్నారు.


మైదుకూరులోని బద్వేలు రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ వినాయకుని విగ్రహం


దువ్వూరు : వినాయకుడికి పూజలు చేస్తున్న ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి


బ్రహ్మంగారిమఠంలోని స్వామి గుడి దగ్గర కొలువుదీరిన వినాయకుడు


చాపాడు : చియ్యపాడు గ్రామంలో కొలువుదీరిన గణనాథుడు

ఘనంగా వినాయక చవితి

మైదుకూరు : మైదుకూరులో వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాత ఊరు, శివుని మాన్యం, శ్రీరామ్ నగర్, వైఎస్ నగర్, సర్వాయిపల్లి రోడ్డు, శీలం నగర్, నంద్యాల రోడ్డు, వినాయక నగర్, ప్రొద్దుటూరు రోడ్డు తదితర ప్రాంతాల్లో గణేష్ విగ్రహాలను నెలకొల్పి మండపాలను మామిడాకులు, అరటి బోదెలు, గరికతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. సోమవారం ఉదయం గణేష్ చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఇళ్లల్లో చిన్న చిన్న వినాయకుని మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పూజలు చేశారు. చిన్న పిల్లలు గణేష్ మండపాల్లో సందడి చేశారు. సోమ, మంగళవారాల్లో వినాయకుని మండపాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల భక్తులు పోటీలు పడి లడ్డును వేలంలో అధిక మొత్తాలకు దక్కించుకున్నారు. పట్టణంలో మండపాల నుంచి బుధవారం నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

వైభవంగా వినాయక చవితి

దువ్వూరు : మండలంలోని అన్ని గ్రామాల్లో వైభవంగా వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తున్నారు. పుల్లారెడ్డిపేటలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రభుత్వ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పంటలు బాగా పండి రైతులు సంతోషంగా ఉండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

నేడు వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

మండలంలోని వినాయక నిమజ్జనంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. మండల వ్యాప్తంగా 104 విగ్రహాలను ఏర్పాటు చేశారని, అందులో 82 విగ్రహాలు బుధవారం నిమజ్జనం చేస్తున్నారని తెలిపారు. కామనూరు, జిల్లెల్ల, నేలటూరు కుందూ నదిలో, చల్లబసాయపల్లె వద్ద ఉన్న ఎస్ఆర్-1 రిజర్వాయర్‌లో, నీలాపురం వద్ద ఉన్న చెరువులో నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

ఘనంగా వినాయక చవితి

బ్రహ్మంగారిమఠం : వినాయక చవితి సందర్భంగా సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మండపాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకుని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఊరూరా వెలసిన గణనాథులు

చాపాడు : వినాయక చవితి పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ఊరూర వినాయక విగ్రహాలను నిలబెట్టారు. ప్రతి గ్రామంలో ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసుకుని సోమవారం వినాయక విగ్రహాలు ప్రతిష్టించారు.భక్తులకు ప్రసాదంతో పాటు అన్నదానం నిర్వహించారు.

వినాయక.. బహురూపాయ..

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయక చవితి పర్వదిన సందర్భంగా పట్టణంలోని అన్ని వీధుల్లో గణనాథుడు కొలువుదీరాడు. వివిధ రూపాల్లో ఏకదంతుడు పూజలందుకున్నాడు. ఈ ఏడాది పర్యావరణ పరిరక్షణ కోసం పలువురు వినాయక కమిటీల వారు మట్టితో రూపొందించిన గణపతులనే ఎక్కువగా పూజించారు. స్థానిక శివాలయంలోని గణపతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 25 తలలు, 50 చేతులతో రూపొందించిన మట్టి గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే మేదర వీధిలో టెంకాయలో గణపతి తదితర వినాయక విగ్రహాలను భక్తులు ఆసక్తిగా తిలకించారు.

30 అడుగుల మట్టి శివగణపతి

స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యామందిరం పక్కన ఏర్పాటు చేసిన 30 అడుగుల మట్టి శివగణపతి ప్రత్యేకత సంతరించుకుంది. కోల్‌కత్తాకు చెందిన 8 మంది కళాకారులు 2 నెలలు కష్టపడి 12 అడుగులు, 30 అడుగుల మట్టివిగ్రహాలను తయారు చేశారు. అక్టోబరు 1వ తేదీన ఈ విగ్రహాన్ని ఫైర్ ఇంజన్ ద్వారా అక్కడే నిమజ్జనం చేయనున్నారు.


మహిళలు వేసిన ముగ్గులు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

స్థానిక సుబ్బిరెడ్డి కొట్టాలలో శివపుత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 29వ గణపతి వార్షికోత్సవాల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. వివిధ ముగ్గులతో ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతకు శిరీష బాయి వ్యవహరించారు. ప్రథమ బహుమతి సురేఖకు రైస్‌కుక్కర్, ద్వితీయ బహుమతి దీప్తిబాయికి మిక్సీ, తృతీయ బహుమతి శ్రావణికి వెండి కుంకుమభరణి అందించారు.


వినాయకుడిని దర్శించుకుంటున్న ఏపీపీఎస్సీ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి దంపతులు

మత సామరస్యం పెంపొందించడం హర్షణీయం

ప్రొద్దుటూరు : వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని ముస్లిం యువకులు వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని పెంపొందించడం హర్షణీయమని ఏపీపీఎస్సీ మెంబర్ నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ మూడో వార్డు పరిధిలో రామ్‌నగర్‌లో ముస్లిం యువకులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఆయన తన సతీమణి, వీరపునాయునిపల్లె జెడ్పీటీసీ రాజేశ్వరమ్మతో కలిసి దర్శించుకుని పూజలు చేశారు.

రాజుపాళెంలో..

రాజుపాళెం : మండలంలో దాదాపు 84 విగ్రహాలు కొలువు దీరాయి. గొడవలు చేసుకోవద్దని ఎస్ఐ రాజగోపాల్ కమిటీ సభ్యులకు సూచించారు. కొన్ని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


వైఎంఆర్ కాలనీ సరస్వతీ విద్యామందిరం వద్ద కొలువైన 30 అడుగుల శివగణపతి


వెంకటేశ్వర్ల పేటలోని సరస్వతీ విద్యామందిరంలో ఏర్పాటు చేసిన హంసవాహన గణపతి


మేదర వీధిలో టెంకాయలో గణనాథుడు


రాజుపాళెం: పూజలందుకుంటున్న గణనాథుడు

అభాగ్యుడికి అంత్యక్రియలు


మృతి చెందిన పవన్‌కుమార్

పోరుమామిళ్ల : అయినవారు ఉన్నా అనాథలా మృతి చెందిన ఓ అభాగ్యుడికి సోమవారం పోరుమామిళ్ల గ్రామ పంచాయతీ సిబ్బంది అంత్యక్రియలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వెనుక రంగసముద్రం సచివాలయం ముందు ఓ వ్యక్తి మతి చెంది ఉండటాన్ని సోమవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గుర్తు తెలియని వ్యక్తిగా భావించి పోలీసులు కొండా ఫణీంద్రారెడ్డి వైకుంఠ రథంలో ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చారు. తరువాత విచారించగా మృతి చెందిన వ్యక్తి పేరు పవన్ కుమార్(34) అని, ఒంటరిగా ఉంటు కూలి పనులకు వెళ్లి దాంతో కడుపు నింపుకునేవాడు. కూలి డబ్బుతో తాగి ఎక్కడో ఓ చోట పడుకుంటాడని సమాచారం. ఆదివారం రాత్రి మద్యం తాగి, నీళ్లు లేక దప్పికతో పడిపోయి చనిపోయినట్లు భావిస్తున్నారు. అతడి సోదరుడు ప్రభాకర్ బద్వేలులో ఉంటున్నాడని తెలిసి సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం ఇక్కడకు వచ్చిన ప్రభాకర్ తాము పేద వారమని చెప్పి పోరుమామిళ్ల పంచాయతీ సిబ్బందితో అంత్యక్రియలు నిర్వహించారు.

డీసీసీబీలో ఈ-స్టాంప్‌ల విక్రయాలు

ప్రొద్దుటూరు : అవినీతికి తావు లేకుండా మెరుగైన పాలన అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీల్లో ఈ-స్టాంప్‌ల విక్రయాలను ప్రారంభించినట్లు ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని డీసీసీబీ బ్రాంచ్‌లో మంగళవారం ఆప్కాబ్ చైర్‌పర్సన్ ఈ-స్టాంప్ విక్రయాలను ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆస్తుల అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఈ విధానం అమలులోకి తెచ్చిందన్నారు. తమ శాఖలో ట్యాక్స్ కంప్యూటరైజేషన్ ఈ ఏడాది ఆఖరుకల్లా పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీలన్నీ లాభాల బాటలోనే ఉన్నాయని, ముఖ్యమంత్రి సొసైటీలను గ్రామాల్లోని ఆర్‌బీకేలకు అనుసంధానం చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. కమర్షియల్‌బ్యాంకులకు దీటుగా సహకార బ్యాంకులు సేవలు అందిస్తున్నాయన్నారు. సొసైటీల ద్వారా పెట్రోలు, గ్యాస్ ఏజెన్సీలతో పాటు ఎరువుల దుకాణాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ సంస్థ ప్రస్తుతం రూ.250 కోట్ల లాభాలతో ఉందన్నారు. మాజీ వైస్ ఎంపీపీ మల్లేల రాజారామ్‌రెడ్డి, సహదేవరెడ్డి, బ్రాంచ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


ఈ-స్టాంప్‌ను ప్రారంభిస్తున్న ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి

అక్టోబర్ 1న సమావేశం

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో స్వామి దర్శనానికి వచ్చే రెడ్డి సోదరుల కోసం 2002లో ఏర్పాటు చేసుకున్న నిత్య అన్నదాన సత్రం నూతన పాలక మండలి కమిటీ నియామకం అక్టోబర్ 1న ఏర్పాటు చేయనున్నట్లు బీ.మఠం ఎంపీపీ చీలేకాంపల్లె వీరనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం బి.మఠంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్వామి దర్శనానికి వచ్చే రెడ్డి సోదరులకు వసతి, భోజన సౌకర్యం అప్పటి రెడ్డి సోదరులు ఏర్పాటు చేశారన్నారు. అయితే కరోనా కారణంగా సత్రం అధ్యక్షుడుగా కొనసాగుతున్న అంకిరెడ్డిపల్లె సిద్దారెడ్డి మృతి చెందాడు. ఆయన స్థానంలో చౌదరవారిపల్లె కు చెందిన అంకిరెడ్డిపల్లె చిన్న ఓబుల్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారని.. అయితే సిద్దారెడ్డి మూడవ కుమార్తె సిద్దేశ్వరమ్మ చిన్న ఓబుల్‌రెడ్డిని తొలగించి 2023 నుంచి బాధ్యతలు చేపట్టిందన్నారు. వీరిమధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోందని ఎంపీపీ తెలిపారు. రాయలసీమ జిల్లాలలోని రెడ్డి సోదరులు అందులో విరాళాలు ఇచ్చిన దాతలు ముందుకు రావాలన్నారు. అక్టోబర్ 1న బి.మఠంలో జరిగే సమావేశానికి హాజరై సత్రం పాలక మండలి ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈశ్వరెడ్డి, రామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేను త్వరగా పూర్తి చేయాలి
– జేసీ గణేష్‌కుమార్


భూ సర్వేను పరిశీలిస్తున్న జేసీ గణేష్ కుమార్

దువ్వూరు : జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా మంగళవారం దువ్వూరు రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న భూ సర్వేను జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే వివరాలను ప్రతి రోజు భూ రికార్డులలో నమోదు చేయాలని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా భూముల హద్దులను ప్రామాణికంగా గుర్తించాలని తెలిపారు. భూ సర్వేలో రైతులు ఎక్కువగా హాజరయ్యేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాకుమారి, సర్వే శాఖ ఏడీ మురళీకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆప్కాస్ డైరెక్టర్‌కు సన్మానం



పోరుమామిళ్ల : ఇటీవల ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ సర్వీస్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమితులైన డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తిని మంగళవారం పోరుమామిళ్లలో అభిమానులు ఘనంగా సన్మానించారు. ఆయన స్వగృహంలో బంధువులు, అనుచరులు, అభిమానులు కళ్యాణ్ చక్రవర్తి దంపతులను గజమాలతో సత్కరించారు. ఆయనకు ఈ పదవి రావడం సంతోషంగా ఉందని వారు పేర్కొన్నారు.

రమణయ్య భాగవతార్‌కు సన్మానం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక బీసీ సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ప్రముఖ హరికథ కళాకారుడు యడవల్లి రమణయ్య భాగవతార్‌ను సన్మానించారు. బీసీ సమాఖ్య సభ్యులు సందు శివనారాయణ వెంకటకృష్ణయ్య, సుబ్బరామయ్య, మాదాసు మురళి, జింకా ప్రకాష్, కాలే దేవానంద్, చంద్రబాబు పాల్గొన్నారు.

లక్ష్మి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ప్రొద్దుటూరు కల్చరల్ : నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. దొరసానిపల్లెకు చెందిన పల్లా రవీంద్రబాబు కానుకగా సమర్పించిన రూ.6.50లక్షల విలువ చేసే 111 గ్రాముల బంగారు కన్నులు, కోరలు, నామాలు మీసాలను స్వామి, అమ్మవారికి అలంకరించారు. భక్తులకు ప్రసాద వినియోగం జరిగింది.